పుణ్యప్రేమము

విశ్వనాథ సత్యనారాయణగారు, M. A.

౧

సుభద్ర పసుపుపచ్చని మనిసి. ఆజానుబాహువు. కన్నులు చెంపకు చేరెడేసి. వక్షోజఘనములు పురఃపశ్చాత్ప్రసృతరజతగిరినితంబములు. ఆమె జడచుట్టిన శిరోజభారము గిరినితంబాగ్రలంబి, నల్లగా తుమ్మెదలు ముసరిన తేనెపట్టు.

ఈ సౌందర్యవతి తెల్లనిపట్టుచీర తాల్చినప్పుడు శరన్మేఘశకలవాహన యగు శచీదేవి; ఆకుపచ్చచీర తాల్చినపుడు శ్రావణమునాటి పచ్చనిపచ్చికబయళ్లతోడి పుడమిపడతి. ఇంకొక రంగుచీర యామె కట్టనే కట్టదు. ఇది యామె బహిస్సౌందర్యము.

ఆమె యంతస్సు చందనాగరుకస్తూరికా పరిమళితము; ప్రాతశ్శిరీషకుసుమకోమలము. ఆ మనస్సులో నామె చదివిన భాగతభాగవతముల వాసన గుప్పున కొట్టుచుండును. అలంకారశాస్త్ర మామె నేత్రనాళముల యందు తరంగలు తరంగలుగా ప్రవహించుచుండును. ఒక్కమాటలో, నామె రసమూర్తి.

ఈ సౌందర్యాధిదేవతాత్వము, ఈ రసాకృతిత్వము నన్నని పలిపపు చందురుని కిరణములు వోని దారములు తీసి సుభద్రాదేవి తన ప్రాణపతి కృష్ణరాయనిచుట్టు తళతళ లాడు సాలీనిగూడల్లినది.

కృష్ణరాయలు సాలుకు నాలుగువేలాస్తి యప్పగించిన తల్లి తండ్రుల కొక్కడే గారాలకూచి. యఫ్. ఏ. చదువుచు ప్రథమసహాయ నిరాకరణపునాళ్లలో మానివేసినాడు. తరువాత సంస్కృతాంధ్రములయందు పరిశ్రమచేసి పాండిత్యముకన్న రసజ్ఞత్వ మెక్కువ సంపాదించినాడు. రూపమున నా శచీదేవికి తగిన శతమఖుడు; ఆధారణీదేవికి తగిన హృషీకేశమూర్తి.

వారి దాధునికనాగరకతానిలయములైన పట్టణముల కెడమైన యొకపల్లెటూరు. సుభద్రకు ఆధునికనాగరకత యన్నచో పచ్చగడ్డి వేసిన భగ్గు మనును.

'పచ్చగడ్డి వేసిన భగ్గు మను' నన్న యీనానుడి యామె వైముఖ్యమునందలి తైక్ష్ణ్యమును మాత్రమే చెప్పును గాని యామె స్వభావమునందలి యర్థచ్ఛాయకూడ తగులదు. ఒకనాడు పితృకార్యవేళ కృష్ణరాయ డుచ్చరించిన హూణశబ్దములయందు సుభద్ర సూచించిన ప్రణయశాసనముకారణముగా నత డామెయెదుట నప్పటినుండి హూణభాషాశబ్ద ముచ్చరించడు.

ఇంక వారి ప్రేమకథ విచిత్రమైనది. ఒకరి హృదయపుఁబొరలలో నొకరు దూరినట్లు వారొకరుద్దేశించిన పను లొకరు తెలుసుకొనకయే గ్రహింతురు. చేయుదురు. వారి కంటి

చివరలలో,బొమలకదలికలలో,అవయవవిలాస చాలనములలో వారి కొకరి కొకరి యెడందలు గోచరించుచుండును. విచిత్రముగ వారొకరి కొకరు సంబంధించినంతవరకు వారి హృదయములు వారి సర్వావయవతచ్చాలనములనిండి నిబిడీకృతమై యితరులయెడ వారిహృదయములు హృదయస్థానములనుండి రేఖామాత్రమైన కదలవు.

వారిరువురకు వారివారి ప్రేమలయొక్క నైశ్చల్యనైర్మల్యములయందుమహాభిమానము.

అక్షయసంవత్సరాషాఢశుక్లమున నొక నాడు సుభద్ర క్రొత్తగా పుట్టింటినుండి వచ్చినది. పరిష్వంగత్వర కల యాదంపతుల కానాటి ప్రొద్దెంత యాలస్యముగ క్రుంకవలయునో యంత యాలస్యముగ క్రుంకినది. డాబామీద పరుపు వేసి విరియబూసిన మల్లెలు మొగ్గ దగ్గరనుంచి త్రుంచి తెచ్చి ప్రక్కపై వెదజల్లి, సుభద్ర మడికట్టుకుని వంటచేసి పతికి భోజనము పెట్టుచుండెను. అంతలో మేఘములు నల్లగా నాల్గుదిక్కులు క్రమ్మి యింద్రుని రథపుశాయమే కూడిపడ్డట్లురుమసాగెను. సుభద్ర యత్తగారు 'నేను వడ్డించెదను. నీవు పోయి డాబామీది ప్రక్క తీసుకుని ర'మ్మన్నది. సుభద్ర కదలలేదు. గంట ముప్పావుగంట మేఘములు కొన్ని పోవుచు, మరల కొన్ని మూగుచు, మధ్య మధ్య చినుకులు తపతప రాలుచునే యున్నవి. పై నన్నమాట యత్తగారు నాలుగుసారు లన్నది.సుభద్ర మాటాడలేదు. కృష్ణరాయలుకూడ నొకసారి 'ప్రక్క యెత్తుకు రారాదా!' అనెను. చిక్కని పెరుగుగడ్డ వెండిగిన్నెలో పడిన చప్పుడున కామాట యామెకు వినంబడలేదు.

కొంత సేపటికొక ఫూలరంగనివంటి గాలి షికారు బయలుదేరి మొగిళ్ల తనకాల జిమ్ము కొంచు పోయెను. రాత్రి జామున్నర ప్రొద్దుపోయిన వేళ నొక యవ్యయానంద నిమేషమున 'ఆకాశము నిర్మేఘముగ నున్నది. చంద్రు డాకాశమున గూడ ప్రకాశించుచున్నా' డన్న భర్తమాటకు సుభద్ర తనలో నది తన ప్రేమనైర్మల్యఫల మనుకున్నది

సుభద్ర సమస్తములైన ఫలములతో నోమునోచినది కాని పనసపండ్లతో నోచలేదు. ఆ మఱుసంవత్సర చైత్రమాసములో పనసపండ్లతో నోము నోత మనుకున్నది. డబ్బిచ్చి కృష్ణరాయలు మనిసిని భీమవరము పంపించినాడు. వాడు తిరిగి తిరిగి యింటికి ఊరకే వచ్చెను. ఎవరో ఒక పెద్ద రాజుగారి కుమార్తె పెండ్లియట. భీమవరం, నర్సాపురం, తణుకు, మారుటేరు, పాలకొల్లులలో నెక్కడను పండ్లు దొరకలేదు. రెండు నెలలకు ముందుగనే యా రాజుగారు బజానా లిచ్చి పండ్లన్నియు తన వశము చేసికొన్నాడని వార్త తెచ్చెను. రేపు పూర్ణిమ. సుభద్ర ముత్తయిదువలను పిలిచెను. జయంతుని పెండ్లినాటి శచీదేవివలె తిరుగుచున్న యామె యీ వార్త విన్నంతనే నిర్జీవి యయిపోయెను. ఇంట నందఱు విచారకబళితముఖులై యుండనే యున్నారు. ఇంతలో

కృష్ణరాయని స్నేహితు డొకడు భీమవరము నుండి యేబది పనసపండ్లు బండిమీద వేసికొని వచ్చినాడు. అందరు నాశ్చర్యపోయిరి.

వెనుక నొకసారి కృష్ణరాయలు తన స్నేహితునితో తన భార్య పనసపండ్లతో వ్రతము చేసికొనవలె ననుకొనుచున్నది. పండ్లు తెచ్చిపెట్టెదవా-యని యతని నడిగెను. అత డాచోట పలుకుబడి కలవా డగుట, రాజుగారి వద్దనుండి యీపండ్ల కనుమతి పొంది యీ వేళకు తెచ్చెను.

వాడిపోయిన కాకరపాదు వానపడినంత నే పూలతో, పిందెలతో కలకలలాడినట్లు మరల నిల్లంతయు నుత్సాహపూరిత మైపోయెను.

ముత్తయిదువలకు వాయనమిచ్చి దొడ్డిలో నికి దేనికో పనిమీద పోయిన సుభద్రతో గిత్త లకు జనపకట్ట వేయుచున్న కృష్ణరాయలు 'నా ప్రేమ నిష్కాలుష్య మిట్టిది. తలవనితలంపుగా పనసపండ్లు వచ్చినవి.' యనెను. ఆ మాట కొక్క మెదబంటి చూపుతో బదులు తీర్చి సుభద్ర లోనికి బోయెను.

'నాయనా! మీ కడుపున కాయ కాచి నచో చూచి పోవలయును రా' యను తల్లిగారి చాలసారు లన్న మాటలతో కొడుకుకోడండ్ర మెదలలో తమ ప్రేమకు బహిశ్చిహ్నము చూడవలె నన్న కోరిక సుభద్రలో నదిమిన సిగ్గులో కృష్ణరాయనికి నవ్వినమాటలో పొడ చూపీ పొడసూపక యొకొక్కసారి తళుకు తళుక్కు మనుచుండును. ఆ యేడాది యంతయు నట్లే గడచినది.

౨

ఆ యేడాది వెళ్లినతోడనే యేమో చల్లని వర్షర్తువుతోనే క్రొత్తయేడాది మొదలు పెట్టినట్లు, శ్రావణము నూతన భావములతో జెలరేగెను. ఉబ్బువాన కురిసి వెలిసిన పెద్ద మెత్తైన మబ్బు నల్లని నీడలలో దూరపు చెల్లు పొరవోలె నున్న నల్లని కన్నుబొమ్మలు కల వాని చూపువలె నవ్యక్తగంభీరముగ నుండె ను. దొడ్డిలోని గుజ్జునేరేడు లొత్తుగా కాచి నేరేటిపండ్లు, పూర్వ మెప్పుడో వేదములు ముచ్చిలికొనిపోయిన యుగాన భగవంతుని యాదిమత్స్యగర్భ మైన గ్రుడ్డు బహూకృత మైన ట్లుండెను. నల్లని వర్షర్తువు దొంగవాని వలె గదులలో దూరి పగలే ప్రభ సాగించెను.

ఆ చీకటిలో సుభద్ర తమయింటిగదిలో గూర్చుండెను. అచ్చట వెలుతురు గుడ్డిగా నున్నది. కలవారి యింటికోడలు చూలు నిలి చిన పండుగ చేసి సెనగలు పేరంట మిచ్చిన తరువాత నామె కట్టిన క్రొత్తచీరతో, పెట్టిన కాటుకతో, రాచిన పారాణితో, వృథా కుపిత మైన శర్వాణివలె నామూల కూర్చున్నది. కృష్ణరాయలు లోనికి వచ్చి యామెను చూచి మందహాసము చేసెను. ఆమెకును నవ్వు వచ్చెను. వచ్చిన నవ్వాపుకొని మొగములో నున్న కోపమే నిలిపెను. ఇంతలో నెవరో గదిలోనికి వచ్చుటచే నకారణ మప్రగల్భమైన

యీ కోపమును రాయలు తీర్చ వీలు చిక్క లేదు.

రోజులు కడచిన కొలంది నామె మన స్సతనికి మిక్కిలి పరిచితమే యయ్యు శరీర మపరిచితి నధికము చేసికో దొడంగెను. కోప మయినా కాని ముఖలక్షణములతో,సమా ర్ధవపరిహృతభర్తృపరిష్వంగప్రయత్నములతో నేడవనెల దరిసెను. పుట్టినింటికి తీసికొని పో వచ్చిన యన్నగారి వెంటబోవుట కేమియు నిష్టము లేకయు వెళ్లుచున్న సుభద్ర కౌగిలి యారునెలలకు కృష్ణరాయనికి తటస్థించెను. కాని యది యుభయులయు బాష్పముల తడిచేతవలె వెంటనే జారిపోయెను.

గబగబ నేదో పని యున్న ట్లింటిలోనికి పోవుట, మరల వాకిలిలోనికి వచ్చుట, యీ పని సేయుటతోడనే కృష్ణరాయనికి రెండు నెలలు గడచినవి. 'నాయనా! ఒకసారి పోయి చూచి రారా' అన్న తల్లిమాట తల్లికే మిగి లినది. సంకల్పవికల్పముల నడుమ గతాగత కారియైన యతడు భార్యను చూడనేలేదు.

వసంతకాలము వచ్చెను. అది వసంతము సొగసు కాబోలు, ఎండవేడిమి కాగలేక కూసిన కోకిలల కూతలలోనే మాధుర్యము వెల్లివిరి సినది. ఎండ పిందెలు, ఎండపూవులు కూడ రుచి హెచ్చినవి, పరిమళించినవి. ఎట్లయిన నేమి? వసంతకాలము ప్రాణము హాయి యని పించినది.

సుభద్రకు గర్భకార్శ్య మల్లుండగా, పతి తన్ను చూడ రాలే దను చింతాకార్శ్య మెక్కువయినది. 'ఇప్పుడు నాతో నేమిపని' యనుకున్నది.

ఏరోజున కారోజున ప్రొద్దున లేచి పోద మని కృష్ణుని యూహ. ప్రొద్దున లేచిన వెంటనే యథాస్థితి జాప్యము.

ఒకనాడు ప్రొద్దున కృష్ణరాయలుగారి వంటయింటిదగ్గర కాకి కూయ మొదలిడెను. అతనితల్లి 'కాకమ్మా కాకమ్మా! కబురు చెప్పు. మాతల్లి నీళ్లాడెనా లేదా' అని సోదె యడిగినది. కాకి గల్లున గంతు వేసి కూసి యెగిరిపోయినది.

కాకి యిట్లా వెళ్లినది, అట్లా కబురువచ్చి నది. సుభద్ర 'చిన్ని మగవానిఁ గనె నఁట.' శాంతి తగిలెనట. కృష్ణరాయని వికల్పజాడ్యము వదలినది. కాని 'శాంతి' వికల్పస్థాన మాక్ర మించినది.

శాంతి యింటికడనే చేసికొనుటకు నిశ్చ యించి యిరువదియొకటవనాటికి సుభద్రను తీసుకుని వచ్చిరి. మూగిన యూరి యాడవా రందరు వారిదారి వారు పోయినతరువాత కృష్ణరాయలు సుభద్ర నేకాంతముగా గలసి కొనెను. పతి కౌగిలించుకొనబోయెను. కాని సుభద్ర యొక నిశితమగు చూపు చూచెను. అందుచే నా కౌగిలింత జరుగునప్పటికి చాల సేపు పట్టినది. శాంతివేళ నూనెలో తండ్రి కొడుకుల మొగముల రెండు నీడ లొకేసారి

చూచిన సుభద్రకు వారిపోలిక మరింత వ్యక్త మయ్యెను. కొన్నాళ్లు గడచెను.

ఒకనాడు సుభద్ర కూర్చుండి యేదో కుట్టుచున్నది. కృష్ణరాయ లేదో చదువు కొనుచున్నాడు. పిల్లవాడు నిద్రపోవుచున్నాడు. సుభద్ర కుట్టు నాపి తల యెత్తి, 'అయితే మీరు నేను మావాళ్ల యింటివద్ద నుండగా నొక్కసారి యయినను రాలేదు కదా!' అనెను.

అతడు పుస్తకమాపి యామెవంకఁ జూచెను. ఆమె చూపులలో ప్రశ్న యట్లే యుండెను. అత డేమి సమాధానము చెప్పుటకును తోచక, 'నీ వొక యుత్తరమైనను వ్రాయలే దేమి ?' యనెను.

'నేను వ్రాసినచో నింట నెవరైన చూడరా' అనెను.

'ఏమి చూచినచో?' అని కృష్ణరాయలు ప్రశ్నించెను.

సుభద్ర దానికి బదులు చెప్పక మరల తనపని తాను చేసికొనుచుండెను. అత డామె వంక చూచుచునే యుండెను.

ఆమె తల యెత్తకుండ ఇట్లన్నది: 'ఆ రోజులలో నేనసలే బలహీనముగా నున్నాను. మీరు రాలేదన్న దిగులుచేత నన్నమే సయించునదికాదు. మరీ చిక్కిపోతిని. నా బలహీనత కుర్రవాని బలుపుకు చెరుపు చేయునన్నా రందరును.'

కృష్ణరాయలు కుర్రవానివంక చూచినాడు. రెండునెలల పిల్లవానికి రెండువందల నగలు పెట్టిరి. అతడు వారి మాటలకు తనకు సంబంధము లేనట్లు నిద్రపోవుచునే యుండెను.

మరి కొంతసేపటికి సుభద్ర 'మీకు నామీద ప్రేమ లేదు' అన్నది. ఆమె కాపురమునకు వచ్చి నాలుగేండ్లయినది. ఇట్టి మాట యామె నోటివెంట నెన్నడు రాలేదు. తరువాత నొక్కనిముసము నిశ్శబ్దత.

మరునిముసమం దిద్దరు నీళ్లు నిండిన కన్నులతో నొకరి నొకరు చూచుకొన్నారు. ఆమరు నిముసమం దొకగాటపు కౌగిలింత. ఇంతలో కుర్రవాడు లేచి కనులు విప్పి చూచెను.

సుభద్ర పిల్లవానిని తీసికొని, 'ఇదిగో నా ప్రేమచిహ్నము' అని కుర్రవానిని పతి కిచ్చెను. అతడు పసివానిని గట్టిగా కౌగిలించుకుని ముద్దు వెట్టుకుని, 'నా ప్రేమచిహ్నమును వీడే' యని యామెకు మరల నందిచ్చెను.

అదివర కాపుణ్యదంపతుల హృదయము లొకరి వొకరి హృదయములలో నుండుచుండెను. ఇప్పు డవి రెండును చేరి పసివానిలో ప్రవేశించెను. సుభద్రకు భర్తృప్రేమ యంతయు పసివానిలో తోచుచుండెను. కృష్ణరాయలకు భార్యాప్రేమ యంతయు పిల్లవానిలో దోచుచుండెను.

ఒకరోజున సుభద్ర అన్నది, 'మీకు నామీదకన్న నబ్బాయిమీదనే మెక్కువ ప్రేమ' అని.

కృష్ణరాయలు అన్నాడు 'నాకు అబ్బాయే నువ్వు. నీకు అబ్బాయే నేను.'

ఆముగ్గురిమధ్య మూడు కౌగిలింతలతో బ్రస్తావన ముగిసినది.

3

పసిపిల్లవానికి ఆరు ఎనిమిది పదినెలలు వచ్చినవి. పిల్లవానికి తలంటిపోసి, యాముదము రాచి, కనులకు కాటుక పెట్టి, మొగాన చుక్క పెట్టి, తొట్టెలో పండుకొనబెట్టి యూచినపుడెల్ల సుభద్ర వానిని చూచి భర్తయందలి తన ప్రేమ యంత యకల్మషమని, స్వచ్ఛమని యూహించుకొనుచుండును. వాడు తనవద్ద పాలు త్రాగు చున్నప్పుడెల్ల తనజీవితసర్వస్వము తన ప్రేమలో ప్రవహించుచున్న దనుకొనుచుండును.

పిల్లవానియెడల నాముద మారి నిద్ర మేల్కొన్న తరువాత వానికి నగలన్నియు పెట్టి భర్తచేతికి ప్రతిదినము మధ్యాహ్నము దాటి యిచ్చినపుడెల్ల కృష్ణరాయలు భార్యయందలి తన ప్రేమ కుర్రవానిలో మూర్తి కట్టిన దనుకొనుచుండును. వానిని తాను లాలించినంత సేపు తనజీవితము తన ప్రేమకై వినియోగించుచున్నానని యత డనుకొనుచుండును.

పిల్లవానికి పన్నెండు నెలలు గడచినవి. పుట్టినరోజు పండుగకు సుభద్రాపతి పెండ్లి యంత హడావిడి చేసినాడు. పిల్లవానికి ఆనాడు బంగరుమువ్వల మొలత్రాడు, మెడలో పులిగోరు, కాళ్లకు గజ్జెలు, చేతులకు రెండు మురుగుల జతలు పెట్టి కుర్చీలో గూర్చుండబెట్టుకుని, సెనగలు, కానులు కలిపి దిగబోసి, పేరంటాం డ్రందరు పాటలు పాడిన తరువాత సుభద్ర కంఠ మెత్తి,

'బాలాయ నీలవపుషే నవకింకిణీక
జాలాభిరామజఘనాయ దిగంబరాయ,
శార్దూలదివ్యనఖభూషణభూషితాయ
నందాత్మజాయ నవనీతముషే నమస్తే'

అని శ్లోకము పాడెను.

అంతలి మృదుభావతరంగపరంపరచే సుస్నిగ్ధమై సుసంస్కృతమైన యామె హృదయము కరిగి యామెలోని భక్తిభావము, పిల్లవానియందలి యనురాగము, తన ప్రేమమయజీవితనిగూఢరహస్యము నన్నియు కలిసి యవ్యక్తమయిన యొక స్రోతోరూపము తాల్చి యామె కన్నులవెంట జాలుగా ప్రవహించెను.

నిశ్శబ్దులై తక్కిన స్త్రీ లామె వంక జూచి కొంతసేపటివర కామె హృదయ మెరుంగక యామె నోదార్చ వచ్చిరి. 'శుభవేళ కన్నీ రేల' యని కొందరు, 'ఆమె మనస్సులో నేమున్నదో' యని మరికొందరు జానపదవైఖరి ప్రదర్శించిరి. ఆమె మనస్సౌకుమార్య మెవరికి దెలియ లేదు. ఆరాత్రి పిల్లవాడు పోరు పెట్టి యేడ్చినాడు. తల్లియు, ముత్తవ తల్లియు తల్లడిల్లి పోయినారు. కచ్చికదృష్టి, ఏకుదృష్టి తీసిరి. పోరు మాన లేదు. ముత్తవతల్లి చివర కుప్పు కూడ తీసి నూతిలో వేసెను. రాత్రి రెండు జాములు దాటువరకు పిల్లవాడు చేతిలో నిలువ లేదు. అప్పటికి కొంచె మరకూర్కె. మరల

డెల్లవారుకడ నేడువ మొదలుపెట్టెను. కొంచెము పడిసెము పట్టెను.

మూడురోజులవరకు పిల్లవాడదే నలతగా నున్నాడు. నంబి పూజారి మంగలులు మువ్వురు వచ్చిరి; చూచిరి. ఏమో మాత్రలిచ్చిరి. ఏమియు నయము లేదు. సుభద్ర ప్రాణములు గుప్పిడిలో బట్టుకున్నది. కృష్ణరాయలు తెలతెలపోయినాడు.

నాల్గవనాడు పిల్లవానికి భారము చేసినది. ప్రొద్దు క్రుంకువేళకు 'మగత' కప్పినది.

ఇంట శోకదేవత ప్రవేశించినది చుట్ట కాల్చి నొసట నంటించిరి. ఉల్లిపాయ నమలి ముక్కులలో నూదిరి. బ్రహ్మజెముడాకురసము పోసిరి. పిల్లవాడు గుక్క తిప్పుకున్నట్లే తిప్పుకొని తల్లితండ్రులతో విడాకులు పుచ్చుకున్నాడు.

కృష్ణరాయని నెత్తిన పెద్ద పర్వతము పడినది. సుభద్ర యొడ్డులేనిసముద్రములో నీదుచున్నది.

మూన్నాళ్లు కడచినవి. భార్యాభర్తలొకరి నొకరు చూచుకొనలేదు. ఈ మూన్నాళ్లును శిశుమృతిదుఃఖమే వారి హృదయములయందు నిండియున్నది.

నాల్గవనాడు సుభద్ర స్నానము చేయుచుండగా పొరుగమ్మ యొకావిడ వచ్చి, 'వాడెవ్వడు, మీ రెవ్వరు? మీరు వాని కేదో ఋణ మున్నారు. వాని ఋణము వాడు తీర్చుకొని పోయినా' డని యోదార్చినది. సుభద్ర కామాటతో పుత్రదుఃఖము శాంతించినది. మరల కొంత సేపటి కామె తన హృదయపరీక్ష చేసికొన్నది. పుత్రదుఃఖముచే నిండియున్న తన హృదయములో జూడరానంత మేర యెడమై యందు తాను తనపతియెడల ద్రోహినన్న భావము కాలుపెట్టినది. ఈ భావము గడియ గడియకు వృద్ధిపొంది ప్రొద్దుగ్రుంకువరకు నామెహృదయమంతయు నిండిపోయినది.

రాత్రి పడ్డది. ఎంత చెప్పినను సుభద్ర భోజనము సేయక పండుకున్నది.

రాత్రి రెండుజాములు దాటినది. అందరును నిద్రపోవుచున్నారు. దొడ్డిలో చీరకొంగు పరుచుకుని పండుకున్న సుభద్రయు, వాకిట నుత్తరీయము పరుచుకుని పండుకున్న కృష్ణరాయలు తక్క తక్కిన జంగమజగత్తంతయు జడమైనది.

ఇరువురి హృదయము లొక్కరీతిగా మండిపోయినవి.

ఇరువురిమనస్సు లొక్కరీతిగా నూహించినవి.

ఇరువురియాత్మ లొక్కరీతిగా నిలిచినవి.

'నాప్రేమ నిష్కల్మష మైనచో మా పుత్రు డేల చనిపోవును? నేను నాకు తెలియని దేదో దోషము, నాభార్య—(లేక) భర్త యెడల చేసితిని. అయ్యయ్యో! ఆ పవిత్రాత్మకు నాయందు సంపూర్ణముగా ప్రేమ లయింపచేసిన యా మనోహరమూర్తికి నేనెంత ద్రోహము చేసితిని! మా శిశువునందు

నా ప్రేమ యకల్మషత, స్వచ్ఛత సంపూర్ణముగా గోచరించిన దనుకొంటినే. ఆ ప్రేమచిహ్న మిట్లు నీరూప మగుటకు నా ప్రేమలో నేదో కల్మష ముండియుండవలెను. నా ప్రేమయే నిష్కల్మష మైన నా ప్రేమ చిహ్నమైన మా శిశువున కీస్థితి రాదు.'

కొంత సేపు వారి యిర్వురిమనస్సులొక్కసారిగా నిలిచిపోయినవి.

తెల్లవారుజాము కోడి కూసినది. తూర్పు చుక్క పొడిచినది. మరల వారియూహ లిట్లు సాగినవి.

'తెల్లవారబోవుచున్నది. ఇంత ద్రోహము చేసిన నేను నా ప్రియురాలిని—(లేక) ప్రియుని ఎట్లు చూతును. ఏ మొగము పెట్టుకుని యతని—ఆమెను పలుకరింతును. నే నా మొగముమీద నాచూపులు నిలుపలేను. ఈ నా దోషమునకు నిష్కృతిలేదు. నా యీదోషగత ప్రేమము నిర్దోష మగుట యెట్లు? నేను మాత్ర మా మొగము మరల చూడలేను. చూచినచో నాహృదయ మొక్కసారిగా సహస్రధా శకలిత మగును. నేను చూడలేను. ఏ మొగము పెట్టుకుని చూడగలను?'

ఇద్దరి కనుగొనలనుండి బాష్పములు కురిసెను. హృదయములు గంటకు వేయిసార్లుగా గొట్టుకొనెను.

మరల వ్యథాకులితులు, నిర్వాక్కులు, నిరాదృతశరీరసుఖులు నగు నా దంపతులకు మూన్నాళ్లు గడచినవి.

సుభద్ర నోదార్చుటకు పుట్టింటికి తీసికొని పోదుమని యామెతల్లియు, నన్నగారు ననిరి. కృష్ణరాయునితో చెప్పిరి. దుఃఖము, నిరాశ పెనవేసికొని లజ్జ యుబికిన స్తంభ మతని శరీరమునందు తోచి యతడు నిరుత్తరు డయ్యెను. తనయొడలు, తనమనస్సు తా నెఱుగని స్థితిలో సుభద్రను పుట్టింటికి తీసుకొనిపోయిరి. సుభద్ర పుట్టినింట మూడునెల లుండెను. ఆరునెల లుండెను. ఎప్పటి కప్పుడు సద్యోమృతపుత్ర విరహిణివలె నుండును గాని మార్పు లేదు. ఊరివా రందరు వచ్చిరి. రోజు రో జూరార్చిరి. పతియెడల తాను చేసిన ద్రోహమున కని యామె దుఃఖించుచున్నదని వారికి తెలియదు. వారి యోదార్పు మాటలు కారణ మెరుగని వైద్యమువలె నిరర్థకము లయ్యెను. అంతకంత కామె కృశించిపోవుచుండెను.

ఇంటివద్ద కృష్ణరాయలు మౌని యైనాడు. నవ్వుచు త్రుళ్లుచు నుండునాతడు కొడుకు చావుతో మారిపోయినా డనుకున్నా రూరివా రందరు. అత డెవ్వరితోడను మాటాడడు. క్రమక్రమముగా వ్యవసాయ మెత్తివేసెను. పొలము కౌలున కిచ్చెను. వాకిట బసవులే లేవు. 'నాయనా! కోడలిని తీసుకు రావురా' అని తల్లి యనును. అతడు కూర్చున్నవాడు లేచి వాకిలిలోనికి పోవును. తల్లి యూరివారిచేత ప్రస్తావింప జేసినది. కృష్ణరాయలు వినుచుఁ దలాడించెను.

ఎన్నాళ్లయిన నింతే యని యన్నగారు సుభద్ర నొకనా డత్తవారింటికి తీసుకుని

వచ్చెను సుభద్ర యింటికి వచ్చునప్పటికి కృష్ణరాయ లూర లేడు. అప్పటికి పదిరోజుల క్రిందట శ్రీశైలమునకు పోయెదనని చెప్పి వెళ్లినాడు.

సుభద్ర యిచట నొక నెల యుండెను. ఆమెకు క్షయవ్యాధి పుట్టెను. శచీదేవికి శవాకృతి వచ్చినది. భూదేవి పూచికపుల్ల యైనది. మరల నన్నగారు తీసికొని వెళ్లినారు.

ఆమె వెళ్లిన పదిరోజులకు కృష్ణరాయ లింటికి వచ్చినాడు. గడ్డము పెరిగి పిచ్చవాని వలె నున్నాడు. సుభద్రజబ్బుసంగతి తల్లి యతనితో చెప్పెను. కృష్ణరాయలు గడపలోని వాడు గడపలో నుండియే యత్తవారింటికి పోయినాడు. పాప మతనికి సుభద్ర చూపు మాత్రమే యుండినది. అతనిని చూచినపుడు సుభద్రకు కన్నులలో నీరు తిరిగి యవ్యక్తముగా నీమాటలు నోట వచ్చినవి. 'నా ప్రేమలోని నాకు తెలియని కాలుష్యమువలన నీ కొడుకు పోయినాడు. క్షమింపుము' అని ఆమె చేతు లెత్తి నమస్కరించపోయినది. చేతులు రాలేదు. మరునిముస మామెలో చైతన్యము లేదు. కృష్ణరాయలు 'అయ్యో! నా తప్పు కాని యిది నీ తప్పు కాదు' అని విరుచుకుని పడిపోయెను.

కొన్నాళ్లకు వారాణసీఘట్టమున నొక పురుషుడు, నొక స్త్రీయు, నొక మృతశిశువును పాతిపెట్టుచుండిరి. ఒక బాలసన్న్యాసి దారివెంట పోవుచు నచట నిలిచి చూచుచుండెను. వారతని చూచి, 'స్వామీ! ఏమట్లు చూచెదరు' అని యడిగిరి. సన్న్యాసి 'యీ శిశువు మీ శిశువేనా' అనెను. వారగు ననిరి. 'మీరిద్దరు భార్యాభర్తలా' యని సన్న్యాసి మరల ప్రశ్నించెను. వారు 'చిత్త' మనిరి. సన్న్యాసి 'ఓయీ! శిశువులు దీర్ఘాయువు లగుటకు తల్లి తండ్రుల ప్రేమ నిష్కల్మషమై యుండవలెను. ఆ నిష్కల్మషత యెట్లు పాలించవలయునో మనకు తెలియదు' అని ఛరాలున నడచి పోయెను. వారు తెల్లతెల పోయిరి.

మా చందాదారులకు

మా కార్యాలయమునకు వ్రాయు ఉత్తరములు మొదలయినవానియందు తమ 'చందాదారు' సంఖ్య వ్రాయవలెను. లేకున్న ప్రత్యుత్తరములు మొదలయిన పనులను జరుపజాలము. చందాదారులసంఖ్య భారతి కవరుకాగితముపై తమ విలాసమునకు ముందున్నది. చందాదారులకు భారతి ౧౦-వ తేద లోపల అందకపోయిన యెడల వెంటనే తపాలువారికిని, మా కార్యాలయమునకును తెలుపగోరెదము

మేనేజరు, 'భారతి.'